

సబ్సిడీ టమోటా విక్రయాలు ప్రారంభం

ప్రజాశక్తి- అనంతపురం



రైతుబజార్‌లో సబ్సిడీ టమోటా విక్రయ కేంద్రం

అనంతపురం నగరంలోని పిఆర్‌పి రైతుబజార్‌లో సబ్సిడీ టమోటా విక్రయ కేంద్రాన్ని వ్యవసాయ మార్కెటింగ్ శాఖ ఆధ్వర్యంలో బుధవారం ప్రారంభించారు. ఈ కేంద్రాన్ని జిల్లా వ్యవసాయ మార్కెటింగ్ అధికారి పి.సత్యనారాయణ చౌదరి ప్రారంభించారు. ప్రజలకు కిలో 50 రూపాయలకే అందించేలా అమ్మకాలు చేపట్టారు. ప్రస్తుతం బహిరంగ మార్కెట్‌లో కిలో రూ.100కు పైబడి టమోటా ధరలు ఉన్న కారణంగా ప్రజలకు భారం కాకుండా సబ్సిడీ ధరకు టమాటాను రైతుబజార్ అందించేందుకు ప్రభుత్వం ఈ ఏర్పాటు చేసిందని అధికారులు చెప్పారు. టమోటా ధరలు తగ్గేంత వరకు ఈ కౌంటర్ అందుబాటులో ఉండనుంది. ఈ కార్యక్రమంలో రాప్తాడు మార్కెట్ కమిటీ కార్యదర్శి రాంప్రసాద్, ప్రతాప్‌రుద్ర పాల్గొన్నారు.



ధ్రువీకరణ పత్రాలను అందిస్తున్న కలెక్టర్ గౌతమి, ఎమ్మెల్యే వెంకట్రామిరెడ్డి

జగనన్న సురక్షతో సమస్యలు పరిష్కారం

కలెక్టర్ గౌతమి, ఎమ్మెల్యే వెంకట్రామిరెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ప్రభుత్వం నిర్వహిస్తున్న జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజా సమస్యలు పరిష్కారం అవుతాయని కలెక్టర్ ఎం.గౌతమి, గుంతకల్లు ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి తెలిపారు. బుధవారం ఉదయం గుంతకల్లు నియోజకవర్గంలోని పామిడి మండలం జి.కొట్టాల గ్రామ సచివాలయం వద్ద జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల సమస్యలను సత్వరమే పరిష్కరించడానికి జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రభుత్వం అమలు చేస్తోందని తెలిపారు. ప్రజల చెంతకే ప్రభుత్వ సేవలు అందుతున్నాయని చెప్పారు. జులై 1 నుంచి ఆగస్టు 1వ తేదీ వరకు జరిగే ఈ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇందులో 11 రకాల సర్టిఫికెట్లను ఎలాంటి సర్వీసు ఛార్జీలు లేకుండా ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే వై.వెంకటారామిరెడ్డి మాట్లాడుతూ అన్ని వర్గాల సంక్షేమం కోసమే ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మోహన్ రెడ్డి అనేక సంక్షేమ అభివద్ధి కార్యక్రమాలను అమలు చేస్తున్నారని తెలిపారు. గడపగడపకు మన ప్రభుత్వం, జగనన్న సురక్ష కార్యక్రమాలను ఎంతో ప్రతిష్టాత్మకంగా పకడ్బందీగా అమలు చేస్తున్నారని తెలిపారు. కుల,మతాలు, పార్టీలతో సంబంధం లేకుండా అర్హులందరికీ ప్రభుత్వ పథకాలను అందిస్తున్నట్లు చెప్పారు. అనంతపురం ప్రజలకు వివిధ రకాల ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కేంద్ర సహకార బ్యాంకు ఛైర్మన్ లిఖిత, ఆర్డీవో రవీంద్రతో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



జెసి మౌనం వెనుక..?

◆ దివాకర్‌రెడ్డి రాజకీయాలకు దూరం జరిగారా.? ◆ ఆయన తనయుడు పవన్ పయనమెటు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

అనంతపురం జిల్లా రాజకీయాల్లో ఎప్పుడూ హాట్ టాపిక్‌గా ఉండేది జెసి కుటుంబం. ఇప్పటికీ తాడిపత్రి మున్సిపల్ ఛైర్మన్ జెసి.ప్రభాకర్‌రెడ్డి వార్తల్లో ప్రముఖంగా ఉంటూనే ఉంటారు. కాని ఆయన అన్నయ్య జెసి.దివాకర్‌రెడ్డి మాత్రం గత కొంతకాలంగా మౌనంగా ఉంటూ రావడం రాజకీయవర్గాల్లో చర్చనీయాంశంగా ఉంది. స్వపక్ష నేతలైనా, విపక్ష నేతల గురించి అయినా నిర్మోహమాటంగా మాట్లాడి ఆయన ఎప్పుడూ వార్తల్లో వ్యక్తిగా ఉంటూ వచ్చేవారు. అయితే గత కొంత కాలంగా ఆయన రాజకీయపరమైన వ్యాఖ్యలేవి చేయకుండా మౌనంగా ఉంటూ రావడం వెనుక ఆంతర్యమేమిటన్న చర్చ సర్వత్రా నడుస్తోంది. రాజకీయాల్లో ఆయన ఓటమి ఎరుగుని నాయకుడిగా ఉంటూ వచ్చారు. 1983లో తొలిసారిగా రాజకీయ రంగ ప్రవేశం చేసి స్వతంత్రగా ఆ ఎన్నికల్లో పోటీ చేసి ఓటమి చెందారు. ఆ తరువాత 1985లో కాంగ్రెసు పార్టీ తరుపున తొలిసారిగా పోటీ చేశారు. అప్పటి నుంచి 2009 వరకు కాంగ్రెసుపార్టీ తరుపేనే పోటీ చేసి డబుల్ హ్యాట్రిక్ విజయాలను సాధించారు. ఆ తరువాత 2014లో రాష్ట్రరాజకీయ పరిణామాల నేపథ్యంలో టిడిపిలో చేరి పార్లమెంటుకు పోటీ చేశారు. ఈ ఎన్నికల్లోనూ ఆయనే విజయం సాధించారు. ఇక 2019 ఎన్నికల్లో ఆయన పోటీ చేయలేదు. ఆయన తనయుడు జెసి. పవన్‌కుమార్‌రెడ్డి తొలిసారిగా పోటీ చేశారు. ఆయన ఓటమి చెందారు. ఈ రకంగా ఆయన పోటీ చేసి ఓటమి చెందింది మొట్టమొదటి సారి ఎన్నికలోనే, ఆ తరువాత అన్ని ఎన్నికల్లో విజయం సాధించి ఓటమి ఎరుగని నాయకుడిగా ముద్ర వేసుకున్నారు. 2019 ఎన్నికల్లో ఓటమి తరువాత కూడా రాజకీయంగా హడివుడే చేశారు. ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డిపైనా అనేక విమర్శలు చేశారు. ఇదే సమయంలో ప్రభుత్వం వైపున ఉంచి ఆయనకు సంబంధించి గనులను మూసివేయడం తదితర సమస్యలు చుట్టుముట్టినా తన విమర్శల పదునును తగ్గించలేదు. అయితే గత కొంత కాలంగా వీటికి దూరంగా ఉంటూ, ఎటువంటి రాజకీయపరమైన వ్యాఖ్యలు చేయకుండా మౌనంగా ఉంటూ వస్తున్నారు. త్వరలో ఎన్నికలు సమీస్తున్న తరుణంలోనూ ఆయన రాజకీయపరంగా యాక్టివ్‌గా లేకపోవడం చర్చనీయాంశమూ అవుతోంది. ఇదే నేపథ్యంలో ఆయన తనయుడు జెసి, పవన్‌కుమార్‌రెడ్డి కూడా రాజకీయపరమైన కార్యక్రమాల్లో పాల్గొనటం లేదు. టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారాలో కేశ్ పాదయాత్రలోగాని, పార్టీ కార్యక్రమాల్లోనూ ఎక్కడా కనిపించటం లేదు. వ్యక్తిగత కార్యక్రమాల రిత్యా కొంతకాలం ఇతర దేశాలకు వెళ్లినప్పటికీ, ఆ తరువాత కూడా ఆయన పాల్గొన్న దాఖలాలు కనిపించడం లేదు. ఆ కుటుంబం నుంచి బాబాయ్ జెసి.ప్రభాకర్‌రెడ్డి, ఆయన కుమారుడు అస్మిత్‌రెడ్డిలే తాడిపత్రి అసెంబ్లీ నియోజకవర్గం కార్యక్రమాల్లో చురుగ్గా ఉంటున్నారు. జెసి.దివాకర్‌రెడ్డి, పవన్‌కుమార్‌రెడ్డిలు మాత్రం ఎన్నికల సమయం ఆసన్నమైనా కనిపించకపోవడం చర్చనీయాంశమూ అవుతోంది. వచ్చే ఎన్నికల్లో ఆయన అసెంబ్లీ బరిలో దిగుతారా లేక పార్లమెంటుకే మరోమారు ప్రయత్నిస్తారా అన్న చర్చ కూడా నడుస్తోంది. ఏది ఏమైనా ఎప్పుడూ రాజకీయాల్లో హాట్‌టాపిక్‌గా ఉండే ముఖ్య నేత ఇలా సైలెంట్ అవడం వెనుక ఆంతర్యం ఏమిటా అని రాజకీయ వర్గాల్లో గుసగసలు వినిపిస్తున్నాయి.



తోపుడు బండ్ల వ్యాపారుల పొట్ట కొట్టొద్దు

సిపిఎం ఆధ్వర్యంలో సర్వజనాసుపత్రి ఎదుట నిరసన

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్



ప్రభుత్వ ఆసుపత్రి ఎదుట నిరసన తెలుపుతున్న సిపిఎం నాయకులు

జిల్లా సర్వజనాసుపత్రి ఎదుట రోడ్డుపై తోపుడు బండ్లు ఏర్పాటు చేసుకుని టిఫిన్, భోజనం, టీ, వంటి చిరు వ్యాపారాలు చేసుకుంటున్న వ్యాపారులను అక్కడి నుంచి ఖాళీ చేయించి పొట్టగొట్టే చర్యలను ప్రభుత్వం మానుకోవాలని సిపిఎం నగర కార్యదర్శులు వి.రామిరెడ్డి, ఆర్‌వి.నాయుడు కోరారు. బుధవారం ఉదయం సర్వజనాసుపత్రి వద్ద తోపుడు బండ్ల వ్యాపారులను అక్కడి నుంచి ఖాళీ చేయించే విధంగా మున్సిపల్ అధికారులు యత్నాలను సిపిఎం నేతలు అడ్డుకున్నారు. నగర కార్పొరేషన్ డిప్యూటీ కమిషనర్ రమణారెడ్డి, ఇతర అధికారులు, సిబ్బంది వచ్చి తోపుడు బండు తొలగించేందుకు యత్నించారు. దీంతో సిపిఎం నాయకులు అడ్డుకుని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు రామిరెడ్డి, ఆర్‌వి.నాయుడు మాట్లాడుతూ సర్వజనాసుపత్రి వద్ద తోపుడు బండ్ల వ్యాపారులు 1980 సంవత్సరం నుంచి బండ్లు ఏర్పాటు చేసుకుని జీవిస్తున్నారని తెలిపారు. తక్కువ ధరలకే టిఫిన్, భోజనం, టీ, పండ్లు, ఇతర సామాగ్రి విక్రయిస్తూ జీవనం సాగిస్తున్నారని తెలిపారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు కూడా అందుబాటులో ఆహార పదార్థాలు ఉండటంతో తక్కవ ధరలకే తీసుకుని వైద్యం చేయించుకుని వెళుతుంటారని తెలిపారు. లాభాపేక్ష ఒక్కటే వ్యాపారంగా కాకుండా సామాజిక సేవలో భాగంగా తోపుడు బండ్ల వ్యాపారులు ఉన్నారని తెలిపారు. రాష్ట్ర గవర్నర్ జిల్లా పర్యటన సందర్భంగా ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతాయని నమ్మించి తోపుడు బండ్లు తొలగించారన్నారు. పర్యటన పూర్తైన తరువాత యథాతదంగా చిరు వ్యాపరులు తోపుడు బండ్లు ఏర్పాటు చేసుకుంటుంటే నగర కార్పొరేషన్, పోలీసు అధికారులు సర్వజనాసుపత్రి వద్ద నుంచి తోపుడు బండ్లు ఖాళీ చేయించాలని చూడటం సరికాదన్నారు. తోపుడు బండ్ల వ్యాపారులకు జీవనోపాధి, రోగులకు తక్కువ రేటుతో భోజనం లభిస్తుందన్నారు. కావున సామాజిక అవసరంగా భావించి తోపుడు బండ్ల వ్యాపారులను అక్కడి నుంచి ఖాళీ చేయించరాదని కోరారు. మొండిగా అధికారులు ఖాళీ చేయించాలని చూస్తే ఉదృతంగా పోరాటాలు చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. నగర కార్పొరేషన్ అదనపు కమిషనర్ రమణారెడ్డి ఆందోళన కారులతో మాట్లాడారు. తోపుడు బండ్ల వ్యాపారులకు ప్రత్యామ్నాయం ప్రాంతం చూసుకుని అక్కడ ఏర్పాటు చేసుకోవాలన్నారు. 15 రోజులు గడువు ఇస్తున్నామని, ఆ లోపు తోపుడు బండ్లు ఖాళీ చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నగర కార్యదర్శులు వెంకటనారాయణ, ముత్తుజా, అధ్యక్షులు బాబు, రాజీవ్ కాలనీ ఉప సర్పంచ్ మసూద్, సిపిఎం నాయకులు ప్రకాష్, ఆటో యూనియన్ నాయకులు ఇర్ఫాన్, తోపుడు బండ్ల వ్యాపారుల సంగం నాయకులు రవి, కుమార్, వెంకటరత్నం, అనిత, నాగేంద్రమ్మ, అరుణ తదితరులు పాల్గొన్నారు.

తులసీచంద్‌పై దాడికి యత్నిస్తున్న వారిని శిక్షించాలి



ఎస్పీకి వినతిపత్రం అందజేస్తున్న మహిళా ప్రజాసంఘాల ఐక్యవేదిక నాయకులు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

మహిళా ఇండిపెండెంట్ జర్నలిస్ట్ తులసీచంద్‌పై కొన్ని అసాంఘిక శక్తులు దేశద్రోహిగా ముద్రవేస్తూ, దాడికి యత్నిస్తున్న వారిని వెంటనే అరెస్ట్ చేసి శిక్షించాలని మహిళా ప్రజా సంఘాల ఐక్యవేదిక నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం నాడు అనంతపురం ఎస్పీ కె.శ్రీనివాసరావును కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మహిళా ప్రజాసంఘాల ఐక్యవేదిక నాయకులు డాక్టర్ ప్రసూన, వి.సావిత్రి, పద్మావతి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ఇండిపెండెంట్ జర్నలిస్ట్‌గా తులసీచంద్ పనిచేస్తూ వ్యవస్థలో లోపాలను ఆమె ఛానల్ ద్వారా ప్రజలకు తెలియజేస్తున్నారని చెప్పారు. ఆమె ఏ రాజకీయ పార్టీకి సంబంధించిన వ్యక్తి కాకపోయినా కొందరు రాజకీయాలు అంటగట్టి దేశద్రోహిగా చిత్రించే కుట్ర జరుగుతోందన్నారు. మతోన్మాదం, పాలకుల అవినీతి, అక్రమాలు, ఆ పార్టీల విధానాలతో సమాజానికి జరిగే నష్టాలను ఆమె విశ్లేషిస్తోందన్నారు. దీనిని జీర్ణించుకోలేని కొన్ని రాజకీయ పార్టీలు ఆమె దేశద్రోహం చేస్తోంది అన్నట్లుగా దాడులు చేసే కుట్రలకు పాల్పడడం సిగ్గుచేటన్నారు. సోషల్ మీడియా వేదికగా ఆమెపై అశ్లీల పోస్ట్‌లు, మార్ఫింగ్‌లు పెట్టి హింసకు గురి చేయడం దుర్మార్గమైన చర్య అన్నారు. ఆమె కుటుంబాన్ని నాశనం చేస్తామనే పద్ధతుల్లో బెదిరిస్తున్నారని తెలిపారు. ఇదివరకే బెంగుళూరులో గౌరిలంకేష్ అనే మహిళా జర్నలిస్టును సమాజం కోల్పోయిందన్నారు. ఇప్పుడు మళ్లీ తులసీచంద్ లాంటి సమాజహితం కోరే పాత్రికేయురాలిని పోగొట్టుకోవడానికి సిద్ధంగా లేమన్నారు. ఆమెకు మహిళా సమాజం అండగా ఉంటుందన్నారు. తులసీచంద్‌పై ఎలాంటి దాడులు జరిగినా గ్రామానికి ఒక తులసీచంద్ తయారవుతారన్న సత్యాన్ని మతోన్మాద, దుర్మార్గ రాజకీయ పార్టీల నాయకులు తెలుసుకోవాలని చెప్పారు. ఆమెపై జరుగుతున్న విద్వేష ప్రచారాలను తక్షణమే నియంత్రించేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మహిళా సంఘాల ఐక్యవేదిక నాయకులు రాజేశ్వరి, రామాంజినమ్మ, పార్వతి, లక్ష్మిదేవి, శ్వేత తదితరులు పాల్గొన్నారు.



చలో విజయవాడలో అరెస్టు అయిన అనంతపురం ఎస్ఎఫ్ఐ నాయకులు

చలో విజయవాడలో అనంత ఎస్ఎఫ్ఐ నేతలు అరెస్టు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

ఇంటర్మీడియట్ చదువుతున్న విద్యార్థులకు ప్రభుత్వమే ఉచితంగా పాఠ్యపుస్తకాలు పంపిణీ చేయాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిర్వహించిన చలో విజయవాడ కార్యక్రమం ఉద్రిక్తతలకు దారి తీసింది. విజయవాడలోని ఇంటర్మీడియట్ బోర్డ్ కార్యాలయం ముట్టడి చేపట్టారు. ఈ పోరాటంలో అనంతపురం జిల్లా ఎస్ఎఫ్ఐ నేతలు పాల్గొన్నారు. పోరాటంలో భాగంగా పోలీసులు అనంతపురం జిల్లా ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఓతురు పరమేష్, నాయకులు సిద్ధు, షమీర్, రాఘవేంద్ర, వినోద్, చంద్ర, ముస్తఫా తదితరులను అరెస్టు చేశారు. ఈ సందర్భంగా ఓతూరు పరమేష్ మాట్లాడుతూ విద్యా సంవత్సరం ప్రారంభమై రెండు నెలలు కావస్తున్నా ఇంటర్మీడియట్ పాఠ్యపుస్తకాలు ఇవ్వడంలో రాష్ట్ర ప్రభుత్వం జాప్యం చేస్తోందన్నారు. విద్యార్థులకు తక్షణం పాఠ్యపుస్తకాలు ఇవ్వాలన్నారు. హాస్టల్స్‌లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలన్నారు. మౌలిక వసతులు కల్పించాలని కోరారు. ఖాళీగా ఉన్న అధ్యాపకుల పోస్టులు భర్తీ చేయాలన్నారు. అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరన్నారు. సమస్యలు పరిష్కరిస్తే ఉద్యమాలు చేయాల్సిన అవసరం మాకు ఉండదన్న విషయాన్ని ప్రభుత్వ పాలకులు గ్రహించాలని హితవు పలికారు.

'చిరంజీవ యువత, జనసేన పార్టీ వేరు కాదు'

భవాని రవికుమార్

ప్రజాశక్తి అనంతపురం

ప్రజా నాయకులు చిరంజీవి అభిమానులు జనసేన పార్టీ పల్లకి మోయడానికి సిద్ధంగా ఉన్నారని,చిరంజీవి అభిమాన సంఘం రాష్ట్ర నాయకులు భవానీ రవికుమార్ తెలిపారు. ఇటీవల కాలంలో అధికార పార్టీ వైసిపి కుటిల రాజకీయాల్లో భాగంగా మెగాస్టార్ చిరంజీవి పవన్ కళ్యాణ్ అభిమానులను కార్యకర్తలను వేరు చేసే క్రమంలో సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారాలను ముందుకు తీసుకురావడం సరైనది కాదని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా చిరంజీవి అభిమానులు కార్యకర్తలు జనసేన గెలుపే లక్ష్యంగా పనిచేసేందుకు సిద్ధంగా ఉన్నామని తెలియజేశారు. సోషల్ మీడియాలో వైసీపీ వాళ్లు పోస్టులు పెడుతున్నారని, ఇలాంటి పనులను వారు మానుకోవాలని హితవు పలికారు. జనసేన పార్టీ రాబోయే ఎన్నికల్లో అధికారం లోకి వచ్చే విధంగా, కళ్యాణ్ గారిని ముఖ్యమంత్రి చేసే విధంగానే చిరంజీవి ప్రయాణం ఉండాలని అభిమానులు కార్యకర్తలకు పిలుపునిచ్చారు.

లీగల్ మెట్రాలజీ అధికారుల తనిఖీలు

అనంతపురం : నిత్యావసర వస్తువుల అమ్మకాల్లో వినియోగదారులను మోసం చేస్తున్న వ్యాపారులపై లీగల్ మెట్రాలజీ అధికారులు బుధవారం కొరడా ఝుళిపించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అసిస్టెంట్ కంట్రోలర్, లీగల్ మెట్రలజీ ఆధ్వర్యంలో అనంతపురం, గార్లదిన్నె , ఆత్మకూరు, హిందుపురం, రాయదుర్గం పట్టణం ఆకస్మిక తనిఖీలు చేశారు. ఇందులో భాగంగా 26 కిలోల బస్తాలు 25 కిలోలు ఉన్నందున 6 కేసులు, వంటనూనెలు తక్కువ తూకం ఉన్నందుకు 2 కేసులు మొత్తం 8 కేసులు నమోదు చేసి రూ. 1,25,000 జరిమానా విధించి నట్లు అసిస్టెంట్ కంట్రోలర్ సుధాకర్ తెలిపారు. పెండింగ్ ఉన్న మరో 2 కేసులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. తనిఖీల్లో ఇన్‌స్పెక్టర్లు మహమ్మద్‌గౌస్, శంకర్, శివశంకర్, శ్రీనివాసులు, సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంపై దృష్టి సారించండి

జెడ్పీ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ



స్థాయి సంఘ సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ

ప్రజాశక్తి-అనంతపురం

ఆయా శాఖల పరిధిలో ప్రజా సంబంధిత సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలని జెడ్పీ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ అధికారులను ఆదేశించారు. అనంతపురం జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయంలో బుధవారం ఉదయం స్థాయీ సంఘ సమావేశాలను నిర్వహించారు. ఉమ్మడి అనంతపురం జిల్లా ప్రజాపరిషత్ ఛైర్‌పర్సన్ గిరిజమ్మ అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశంలో వివిధ శాఖల పురోభివద్ధిపై సమీక్ష నిర్వహించారు. వివిధ శాఖల అధికారులు ప్రగతి నివేదికలు, వారిశాఖ ద్వారా జరుగుతున్న సంక్షేమ, అభివద్ధి కార్యక్రమాలను స్థాయీ సంఘ సభ్యులకు వివరించారు. స్థాయీ సంఘ సభ్యులు వారి సంబంధిత ప్రాదేశిక నియోజక వర్గం నందు గల సమస్యలను సభ దృష్టికి తీసుకురాగా వెంటనే వాటిని పరిష్కరించాలని జిల్లా ప్రజా పరిషత్ ఛైర్‌పర్సన్ సంబంధిత అధికారులను అదేశించారు. విద్యాశాఖలో నిర్లక్ష్యం తీరుపై ఛైర్మన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. శెట్టూరు, కంబదూరు మండలాల్లో మధ్యాహ్న భోజనం తిని విద్యార్థులు అస్వస్థతకు గురైన సంఘటనపై వెంటనే విచారణ జరిపించి అందుకు కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. వైద్య ఆరోగ్య శాఖకు సంబంధించి 104 సర్వీసులను అన్ని మండలాల్లోనూ అందుబాటులో ఉంచాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లా పరిషత్ కార్యాలయ ఆవరణలోని మహాత్మా జ్యోతిబాపూలే విగ్రహం పక్కన సావిత్రిబాయి పూలే విగ్రహం ఏర్పాటు చేసేలా సమావేశంలో తీర్మానం చేశారు. ఈ సమావేశాలలో జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి కె.భాస్కర్‌రెడ్డితో పాటు ఉమ్మడి జిల్లా పరిధిలోని స్థాయీ సంఘాల్లోని జెడ్పీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

యాసిడ్ అమ్మకాలపై తనిఖీలు

ప్రజాశక్తి-అనంతపురం క్రైం

అనంతపురం పట్టణం, రూరల్ సబ్ డివిజన్ల పరిధిలో యాసిడ్ అక్రమ అమ్మకాలు, నిల్వలపై బుధవారం నాడు పోలీసులు తనిఖీలు నిర్వహించారు. వన్‌టౌన్ సిఐ రెడ్డప్ప, టూటౌన్ సిఐ శివరాముడు, 4వ పట్టణ సిఐ ప్రతాపరెడ్డి, ఇటుకలపల్లి, బుక్కరాయసముద్రం, శింగనమల, రూరల్ సర్కిల్ సిఐల ఆధ్వర్యంలో బందాలుగా ఏర్పడి రాంనగర్, కొవ్వూరునగర్, ఆదిమూర్తినగర్, కమలానగర్, కళ్యాణదుర్గం రోడ్డు, బళ్లారి బైపాస్‌లలో తనిఖీలు నిర్వహించారు. అనంతపురం సబ్ డివిజన్ పరిధిలో ఒకటవ పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో మూడు దుకాణాలు, రెండవ పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో రెండు దుకాణాలు, నాల్గవ పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో రెండు దుకాణాల్లో యాసిడ్ అమ్మకాలు జరుగుతున్నట్లు పోలీసు అధికారులు గుర్తించారు. యాసిడ్ అమ్మకాల్లో అక్రమ పద్ధతులు పాటించినా, పరిమితికి మించి నిలువ చేసినా, మైనర్లకు విక్రయించినా కఠిన చర్యలు తీసుకుంటామని దుకాణదారులను పోలీసులు హెచ్చరించారు.

నిరుపేదలకు భూమి పంచాలి

ప్రజాశక్తి-శెట్టూరు


మండల పరిధిలో ఉన్న మిగులు భూములను గుర్తించి 8వ విడత భూ పంపిణీలో భూమిలేని నిరుపేదలకు రెండు ఎకరాల చొప్పున పంపిణీ చేయాలని జెఎసి నాయకులు కోరారు. ఈ మేరకు బుధవారం నాడు డిప్యూటీ తహశీల్దార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుతం సాగులో ఉన్న భూములను సాగుదారులకే ఇవ్వాలన్నారు. భూ పంపిణీలో అక్రమాలకు తావు ఇవ్వకుండా అర్హులకు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ జేఏసీ తాలూకా ఇన్‌ఛార్జి చెలమప్ప, జేఏసీ నాయకులు మాకొడికి రామాంజనేయులు, తిమ్మప్ప, గోవిందు, రామాంజనేయులు, తిప్పేస్వామి పాల్గొన్నారు.

ప్రజాప్రయోజన సేవల కోసమే శాశ్వత అదాలత్

ప్రజాశక్తి-అనంతపురం

ప్రజా ప్రయోజన సేవల కోసం శాశ్వత లోక్‌అదాలత్‌లో తప్పనిసరిగా పరిష్కారం అందిస్తుందని ప్రజా ప్రయోజన సేవల శాశ్వత లోక్‌అదాలత్ ఛైర్మన్ కె.శ్రీనివాస రావు పేర్కొన్నారు. మంగళవారం శ్రీ విజయనగర న్యాయ కళాశాల ఆడిటోరియంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రాఘవేంద్రచార్ అధ్యక్షతన శాశ్వత లోక్‌అదాలత్ సేవలపై సదస్సు నిర్వహించారు. అనంతపురం, సత్యసాయి ఉమ్మడి జిల్లాల ప్రజా ప్రయోజనాల శాశ్వత లోక్‌అదాలత్ ధర్మాసనం అధ్యక్షులు న్యాయమూర్తి కె.శ్రీనివాస రావు, సభ్యులు ఎంవిఎల్‌ఎన్.శ్రీనివాసరావులు ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రసంగించారు. న్యాయ సేవ అధికార చట్టంలోని సెక్షన్ 22బి కింద శాశ్వత లోక్ అదాలత్‌లు దేశవ్యాప్తంగా ఏర్పడ్డాయని చెప్పారు. ప్రజా ప్రయోజనాల శాశ్వత లోక్ అదాలత్‌లో ఫిర్యాదు దాఖలు చేయటానికి ఎటువంటి కోర్టు ఫీజు, రుసుం చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. ఇరుపక్షాల నడుమ సామరస్య పరిష్కారానికి అవకాశం కల్పిస్తూ, సామరస్య పరిష్కారానికి సహకరించని పక్షంలో అందుబాటులో ఉన్న ఆధారాల మూలంగా కేసుల్లో తీర్పు వెలువరించగల అధికారం ఉందన్నారు. అప్పీలుకు ఆస్కారం లేని శాశ్వత పరిష్కారంగా ఈ తీర్పు ఉంటుందని తెలిపారు. న్యాయ విద్యార్థులు శాశ్వత లోక్‌అదాలత్‌పై అవగాహన కలిగి న్యాయ సేవల విస్తరణలో సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మధ్యవర్తిత్వ కేంద్రం సభ్యుడు హరికష్ణ, న్యాయవాదులు సత్యనారాయణ రెడ్డి, ఓబుల రాజు, కళాశాల వైస్ ప్రిన్సిపల్ ఎం.మహేష్ పాల్గొన్నారు.

పాఠశాలల్లో లోపాలు కనిపిస్తే చర్యలు : ఆర్‌జెడి



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్జేడీ వెంకటకృష్ణారెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం సిటీ

ప్రభుత్వ పాఠశాలల్లో ఎలాంటి లోపాలు కన్పించినా సంబంధిత సిబ్బందిపై చర్యలు తప్పవని ఆర్‌జెడి వెంకటకృష్ణారెడ్డి హెచ్చరించారు. అనంతపురం నగరంలోని సైన్స్ సెంటర్‌లో జిల్లాలోని ఎంఇఒ-1, ఎంఇఒ-2, మోడల్ స్కూల్స్ ప్రిన్సిపాల్స్‌తో బుధవారం నాడు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్జేడీ మాట్లాడుతూ ఉన్నతాధికారుల స్కూల్స్ విజిట్స్‌లో ఏలాంటి లోపాలు ఉండకూడదన్నారు. ఎంఇఒలు జాబ్‌ఛార్ట్ ప్రకారంగా పనిచేయాలన్నారు. స్కూల్స్ తనిఖీలకు వెళ్లినప్పుడు టీచర్లతో పాటు విద్యార్థుల హాజరును పరిశీలించాలన్నారు. విద్యార్థులు హాజరుకాకపోతే ఎందుకు రాలేదన్న విషయాలను ఉపాధ్యాయులు, తల్లిదండ్రులతో స్వయంగా తెలుసుకోవాలని సూచించారు. బడిఈడు పిల్లలంతా బడిలోనే ఉండాలన్నారు. వంద శాతం అడ్మిషన్లు నిర్వహించాలన్నారు. ఈనెల 22వ తేదీ లోపు సెమిస్టర్- 2 పుస్తకాలు విద్యార్థులకు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆగస్టు ఒకటి నుంచి ఎఫ్ ఏ-వన్ పరీక్షలు జరుగుతాయని చెప్పారు. ఈ పరీక్షలను 3 నుంచి 9వ తరగతి విద్యార్థులంతా ఇంగ్లీషులోనే రాయాలన్నారు. ఎంఈఓలు, హెచ్‌ఎంలు వారి పరిధిలోని గ్రామ, వార్డు సచివాలయాలను తెలుసుకుని, ఎడ్యుకేషన్ వెల్ఫేర్ అసిస్టెంట్లు వివరాలు కూడా తెలుసుకోవాలన్నారు. మూడు నుంచి 10వ తరగతి, 6 నుంచి పదవ తరగతి విద్యార్థులు ఉన్న పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత లేకుండా చూసుకోవాలన్నారు. ఎంఈఓ-1, ఎంఈఓ-2 ఇద్దరూ ఒకటేనని, ఎలాంటి భేదాభిప్రాయం లేకుండా అందరితో సమన్వయం చేసుకుని విద్యాభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిఇఒ ఎం.సాయిరామ్, డివైఇఒలు పద్మప్రియ, శంకర్ ప్రసాద్, ఎడి కష్ణయ్య, డీఈఓ ఆఫీస్ ఏఎస్ఓ ఓబులరెడ్డి, ఏపీవోలు మారుతి, నాగరాజు, నారాయణస్వామి, ఎండిఎం కో-ఆర్డినేటర్ ముస్తాక్ పాల్గొన్నారు.



పోలీస్ స్టేషన్‌ను పరిశీలిస్తున్న క్వాలిటీ కౌన్సిల్ సభ్యుడు

పోలీసు సేవలపై ఆరా

ప్రజాశక్తి-గార్లదిన్నె

స్థానిక పోలీస్ స్టేషన్‌ను బుధవారం క్వాలిటీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సభ్యుడు బాలచందర్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన పోలీసులు ప్రజలకు అందిస్తున్న సేవల గురించి, ప్రజలతో ఉన్న అనుబంధం, స్టేషన్‌కు వచ్చిన బాధితులతో పోలీసులు వ్యవహరిస్తున్న తీరు, స్టేషన్ పరిసర ప్రాంతాలు, మౌలిక సదుపాయాలు, రికార్డ్స్ నిర్వహణ, తదితర వాటి గురించి చర్చించారు. ఆయన వెంట డీఎస్పీ వెంకటశివారెడ్డి, సిఐ అన్సార్‌బాషా, ఎస్ఐ సాగర్, సిబ్బంది ఉన్నారు.

26న సర్వసభ్య సమావేశం

శింగనమల : ఈ నెల 26వ తేదీ మండల ప్రజా పరిషత్ సర్వసభ సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ నిర్మలకుమారి తెలిపారు. శింగనమలలో బుధవారం ఎంపీడీవో మాట్లాడుతూ సమావేశానికి ఎంపిపి, జడ్పిటిసి, ఎంపీటీసీలు, కో ఆప్షన్ మెంబర్, సర్పంచులు, కార్యదర్శులు, మండల స్థాయి అధికారులు తప్పకుండా హాజరుకావాలన్నారు. అధికారులు నివేదికలు వెంట తీసుకురావాలని తెలిపారు.

రేపు రజక వృత్తిదారుల సమాఖ్య రాష్ట్ర సదస్సు

శింగనమల : రజకుల సమస్యలపై అనంతపురం నగరంలో ఈ నెల 21వ తేదీ నిర్వహించనున్న రజక వృత్తిదారుల సమాఖ్య రాష్ట్ర సదస్సును విజయవంతం చేయాలని సమాఖ్య మండల అధ్యక్షులు పెద్ద రంగయ్య కోరారు. శింగనమలలో బుధవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ రజకులను నాయకులు, పెత్తందారులు వారి అవసరాలకు మాత్రమే వినియోగించుకుంటున్నారని మండిపడ్డారు. రజకులు ఎదుర్కొంటున్న న్యాయమైన సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

గ్రామాల్లో 'జగనన్న సురక్ష' సభలు


నార్పల: మండల పరిధిలోని సిద్ధరాచర్ల, నాయనపల్లి గ్రామ సచివాలయాల్లో బుధవారం సర్పంచులు ఎస్. రామాంజనేయులు, సోంపల్లి లక్ష్మీదేవి, మల్లీశ్వరి అధ్యక్షతన జగనన్న సురక్ష గ్రామసభలు నిర్వహించి లబ్ధిదారులకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా అధికారులు, ప్రజా ప్రతినిధులు మాట్లాడుతూ గ్రామాల్లో ఏ సమస్య ఉన్నా స్పందనలో అర్జీ ద్వారా తెలియజేస్తే పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. సభల్లో మండల ప్రత్యేకాధికారి ఎస్.మహమ్మద్‌రఫీ, ఎంపిడిఒ పి.దివాకర్, తహశీల్దార్ సురేష్‌బాబు, ఈఓఆర్‌డి జి.లక్ష్మీనరసింహా, ఆర్ఐ జ్యోతిరాణి, పంచాయతీ కార్యదర్శులు రఘునాథరెడ్డి, కుళ్లాయప్ప, వహీద, నాయనపల్లి కుళ్లాయిస్వామి, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, తదితరులు పాల్గొన్నారు.

మహిళలతో పెట్టుకుంటే ప్రభుత్వాలు పతనం

కళ్యాణదుర్గం : టిడిపి పిలుపుమేరకు బుధవారం మున్సిపల్ మాజీ ఛైర్‌పర్సన్ బికి రామలక్ష్మిగోవిందప్ప ఆధ్వర్యంలో పట్టణంలో పెద్దఎత్తున ర్యాలీ చేపట్టారు. ముందుకు స్థానిక సాయిబాబా దేవాలయం వద్ద పూజలు చేపట్టి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా మహిళలు మాట్లాడుతూ సైకో జగన్‌రెడ్డి పాలనలో మహిళలపై వేధింపులు , దాడులు రోజురోజుకూ పెరిగిపోతున్నాయన్నారు. మహిళలను అణచివేయాలని చూస్తే ఆ పార్టీకి పుట్టగతులుండవన్నారు. .

ఇన్‌ఛార్జి ఎంపిపి బాధ్యతల స్వీకరణ


పెద్దపప్పూర్ : ఎంపిపి రామ్మూర్తిరెడ్డి రాజీనామా నేపథ్యంలో బుధవారం వైస్ ఎంపిపిగా ఉన్న బొందలదిన్నె రామయ్య ఇన్‌ఛార్జి ఎంపిపిగా బాధ్యతలు స్వీకరించారు. దీంతో ఎంపిడిఒ రామకృష్ణ, ఈఓఆర్‌డీ కమలాబాయి రామయ్యకు శాలువా కప్పి పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపారు. రామయ్య మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. రామయ్యను పలువురు వైసిపి నాయకులు, కార్యకర్తలు, రెవెన్యూ, ఎంపిడిఒ కార్యాలయాలు, ఉపాధి హామీ సిబ్బంది అభినందనలు తెలిపారు.



ఇన్‌ఛార్జి ఎంపిపి రామయ్యను అభినందిస్తున్న అధికారులు, నాయకులు

కమ్యూనిటీ హాల్ కోసం వినతి

శింగనమల : చెరువు కట్టపై వెలసిన షిరిడీ సాయిబాబా మందిరం వద్ద నూతన కమ్యూనిటీ భవనం మంజూరు చేయాలని కోఉతూ బుధవారం రాష్ట్ర ప్రభుత్వ విద్యా సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి, డిసిఎంఎస్ డైరెక్టర్ బొమ్మన శ్రీరామ్‌రెడ్డిలకు ఆలయ కమిటి సభ్యులు శ్రీనాథ్, శేఖర్, రమణ, రామకృష్ణ, రాము యాదవ్ విన్నవించారు. స్పందించిన వారు ఆలయ అభివృద్ధికి సహకరిస్తామని అలాగే ఎమ్మెల్యే నిధుల్లో రూ. 10 లక్షల మేర గ్రాంటు విడుదల చేసి కమ్యూనిటీ భవన నిర్మాణం పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అనంతరం వారు ఆలూరు సాంబశివారెడ్డికి బాబా షీల్డ్ అందజేశారు. కార్యక్రమంలో వైసిపి సీనియర్ నాయకులు బొమ్మన భాస్కర్‌రెడ్డి, నాయకులు నవీన్, చిన్నపురెడ్డి, సాకే లోకనాథ, తదితరులు పాల్గొన్నారు.



సాంబశివారెడ్డి, శ్రీరామ్‌రెడ్డిలను కలిసిన ఆలయ కమిటీ సభ్యులు



మున్సిపల్ కార్యాలయం ముందు నల్ల బ్యాడ్జీలు ధరించి కళ్లకు గంతలు కట్టుకొని నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు

మున్సిపల్ కార్మికుల వినూత్న నిరసన

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

నగరంలో బుధవారం మున్సిపల్ కార్మికులు వినూత్నంగా నిరసన తెలిపారు. సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ వారం రోజులుగా వారు పోరాటం చేస్తున్నా అధికారులు స్పందించలేదు. దీంతో బుధవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం ముందు నల్ల బ్యాడ్జీలు ధరించి కళ్లకు గంతలు కట్టుకొని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు కె.నాగభూషణం, సిఐటి యు నగర కార్యదర్శి వై.వెంకటనారాయణ, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు ఎటిఎం నాగరాజు, నగర కార్యదర్శి తిరుమలేష్ మాట్లాడుతూ ఏడు రోజులుగా కార్మికులు నిరసన వ్యక్తం చేస్తున్నా ప్రభుత్వం గానీ, అధికారులు గానీ స్పందించలేదని మండిపడ్డారు. ఈ నేపథ్యంలో ఈ నెల 20, 21 తేదీల్లో రిలే నిరాహార దీక్షలు చేపట్టనున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం కార్మికులకు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని, లేని పక్షంలో పారిశుధ్య, ఇంజినీరింగ్ కార్మికులతో కలిసి ఈ నెల 27వ తేదీ మున్సిపల్ కార్యాలయా న్ని ముట్టడిస్తా మని, అలాగే ఆగస్టు 7న కలెక్టరేట్ వద్ద ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. అప్పటికీ పరిష్కరించకపోతే ఆగస్టు 17న చలో విజయవాడకు పిలుపునిస్తామని, ఆ రోజు నుంచే సమ్మె బాట పడతామని హెచ్చారించారు. కార్యక్రమంలో మురళి, రాయుడు, ఓబుళపతి, సూరి, సురేష్, సుధారాణి, లక్ష్మీదేవి, పోతలయ్య, మల్లి, ఇంజినీరింగ్ కార్మికులు పాల్గొన్నారు.

ఫ్యాక్షన్ జోలికి వెళ్లొద్దు : డీఎస్పీ

ప్రజాశక్తి-పెద్దవడుగూరు

గ్రామాల్లో ప్రజలు ఫ్యాక్షన్ జోలికి వెళ్లకుండా ప్రశాంత జీవనం గడపాలని డిఎస్పి సిఎం గంగయ్య సూచించారు. డిఎస్‌పి బుధవారం మండల పరిధిలోని ఫ్యాక్షన్ గ్రామమైన అప్పేచెర్లను సందర్శించి గ్రామంలో ఏర్పాటు చేసిన పికెట్ పరిశీలించి పోలీసు సిబ్బందికి సూచనలు చేశారు. అలాగే బహిరంగ సభ నిర్వహించి ఫ్యాక్షన్ దుష్ఫలితాలపై అవగాహన కల్పించారు. ప్రజలు గొడవలు పడకుండా ప్రశాంత జీవనం గడపాలన్నారు. పగలు, ప్రతీకారాలతో రగిలిపోతూ జీవితాలను అంధకారం చేసుకోవద్దన్నారు. ఫ్యాక్షన్‌కు దూరంగా ఉండి పిల్లల భవిష్యత్తుపై దృష్టి పెట్టాలన్నారు. పిల్లలను ఉన్నతంగా చదివించి ఆదర్శవంతులుగా తీర్చిదిద్దాలన్నారు. యువత సినిమాల ప్రభావంతో పెడదోవ పట్టకుండా భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలన్నారు. గ్రామాల్లో ప్రశాంత జీవనానికి భంగం కల్గించే వారి పేర్లను తమ దృష్టికి తెస్తే చర్యలు తీసుకుంటామన్నారు. ఏమైనా సమస్యలుంటే పోలీసులకు తెలాపాలన్నారు. డిఎస్‌పి వెంట ఎస్ఐలు డి.శ్రీనివాసులు, మధుసూదన్‌రావు, నారాయణనాయక్, సిబ్బంది ఉన్నారు.



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న డిఎస్పి సిఎం గంగయ్య

కుల్లాయిస్వామి బ్రహ్మోత్సవాలను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి-నార్పల

రాష్ట్రంలోనే ప్రసిద్ధి చెందిన గుగూడు కుల్లాయిస్వామి బ్రహ్మోత్సవాలను విజయవంతంగా నిర్వహించడా నికి అందరూ సహకరించాలని ఆలయ కార్యనిర్వహణ అధికారి శోభ కోరారు. నార్పలలో బుధవారం ఆమె మాట్లా డుతూ 19వ తేదీ బుధవారం సాయంత్రం నుంచి బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయని 31వ తేదీ సాయంత్రం కుల్లాయి స్వామి చివరి దర్శనంతో ముగుస్తాయని తెలిపారు. 26న చిన్న సరిగెత్తు, 28న పెద్ద సరిగెత్తు, 29 తెల్లవారుజామున అగ్నిగుండ ప్రవేశం, సాయంత్రం జలధి కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. వివిధ రాష్ట్రాల నుంచి భక్తులు భారీగా తరలివస్తారని, వారికి ఎటువంటి అసౌకర్యం కలగకుండా దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. ముఖ్యంగా చలివేంద్రాలు, తాత్కాలిక విశ్రాంతి గుడారాలు, మరుగుదొడ్లు తదితర వాటిని ఏర్పాటు చేశామన్నారు.



ప్రథమ దర్శనమిస్తున్న గూగూడు కుల్లాయిస్వామి

కుల్లాయిస్వామి ప్రథమ దర్శనానికి భక్తుల తాకిడి

మండల పరిధిలోని గూగూడు గ్రామంలో వెలసిన కుల్లాయిస్వామి బ్రహ్మోత్సవాల ప్రారంభం సందర్భంగా బుధవారం రాత్రి స్వామిని ప్రథమ దర్శనం చేసుకునేందుకు భక్తులు పోటెత్తారు. వర్షం కురుస్తున్నా బారులుతీరి స్వామిని దర్శనం చేసుకున్నారు. ఈ సందర్భంగా అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్ఐ రాజశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు. బ్రహ్మోత్సవాలు సజావుగా సాగడానికి అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు సహకరించాలని ఈఓ శోభ కోరారు.

ఓటర్ల తనిఖీలు సక్రమంగా నిర్వహించండి

ప్రజాశక్తి-రాయదుర్గం

రాబోయే సాధారణ ఎన్నికలను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా ఎదుర్కోవడానికి క్లస్టర్, యూనిట్ ఇన్‌ఛార్జిలు, బిఎల్ఎలతో పాటు సెక్షన్ ఇన్‌ఛార్జిలు సిద్ధంగా ఉండాలని టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు కాలవ శ్రీనివాసులు సూచించారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో బుధవారం రియల్ టైం స్ట్రాటజీలో శిక్షణ, ఓటరు పరిశీలనపై ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో కాలవ మాట్లాడారు. ప్రజాభిమానం కోల్పోయిన వైసిపి రాబోయే ఎన్నికల్లో గెలిచేందుకు దొంగ దారులు వెతుకుతోందని, కావున ఈ నెల 21 నుంచి జరిగే ఓటరు వెరిఫికేషన్ కార్యక్రమంలో పార్టీ బిఎల్ఎలు చురుగ్గా పాల్గొని ప్రతి విషయాన్ని క్షుణ్ణంగా గుర్తించాలన్నారు. రాష్ట్రంలో జగన్, రాయదుర్గంలో కాపు రామచంద్రారెడ్డి అరాచక, అవినీతి పాలన గురించి ప్రజల్లో చైతన్యం తీసుకురావడానికి అందరూ శ్రమించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రియల్ టైం స్ట్రాటజీ ట్రైనర్ లక్ష్మీ ప్రసాద్, టిఎన్‌టియుసి రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ గుర్రం నాగభూషణం, పట్టణ అధ్యక్షుడు పసుపులేటి నాగరాజు, పురుషోత్తం, ఇనాయత్, మున్సిపల్ వార్డు సభ్యురాలు ప్రశాంతి, మైనార్టీ సెల్ అధ్యక్షుడు కడ్డిపూడి మహబూబ్‌బాషా, ఎస్సి సెల్ మల్లి, కృష్ణ, తిప్పేస్వామి, సుధాకర్, సిద్దన్న, అంజి, సత్తి, ప్రహ్లాద, లోకేష్, రవి, వెంకటేశ, మల్లేష్ పాల్గొన్నారు.




కార్యక్రమంలో మాట్లాడుతున్న కాలవ శ్రీనివాసులు

సాగు సాయం ఎకరాకు రూ.10వేలివ్వాలి

అఖిలపక్షం రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు

ప్రజాశక్తి-శింగనమల

రాష్ట్రంలో ప్రతిరైతుకీ సాగు సాయం ఎకరాకు రూ. 10వేలు ఇవ్వాలని, బ్యాంకుల్లో రుణాలు మాఫీ చేసి కొత్త రుణాలివ్వాలని, 50 ఏళ్లు నిండిన రైతులకు నెలకు రూ. 10వేలు పెన్షన్ ఇవ్వాలని అఖిల పక్షం రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు డిమాండ్ చేశారు. స్థానిక సిపిఐ కార్యాలయంలో బుధవారం రైతు సంఘం నియోజకవర్గ కార్యదర్శి జి.రాము అధ్యక్షతన నియోజకవర్గ అఖిల పక్ష రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఎపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి డి.చిన్నప్పయాదవ్, టిడిపి నాయకులు రవీంద్ర, వెంకటేశు, కౌలు రైతుల సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నీలపాల రామకృష్ణ, సిపిఐ నాయకులు టి.రామాంజనేయు లు, సిపిఎం నాయకులు భాస్కర్, లక్ష్మిరెడ్డి, కాంగ్రెస్ నాయకులు రాంచరణ్ యాదవ్, రామాంజనేయులు, బిఎస్పి జిల్లా నాయకులు రామాంజనేయులు, చేనేత కార్మిక సంఘం నాయకులు నేసే మధు, గిరిజన సమైక్య నాయకులు నాయక్ హాజరై మాట్లాడారు. అనంతరం తీర్మానాలకు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. ఈ నెల 24న కలెక్టరేట్ ఎదుట మహాధర్నాకు పిలుపునిచ్చామని, జిల్లావ్యాప్తంగా రైతులు తరలి రావాలని కోరారు. సమావేశంలో రైతు సంఘం జిల్లా నాయకులు శివారెడ్డి, చంద్రశేఖర్, బయన్న, గోపాల్, శేఖర, నవీన్, తదితరులు పాల్గొన్నారు.



అఖిల పక్షం రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొన్న నాయకులు

రైలులో నుంచి పడి గుర్తుతెలియని యువకుడు మృతి

గుత్తి : మండల పరిధిలోని తురకపల్లి గ్రామ సమీపంలో రైల్వే బ్రిడ్జి వద్ద మంగళవారం రాత్రి ఓ గుర్తుతెలియని యువకుడు రైలులో నుంచి కిందపడి మృతిచెందాడు. జిఆర్‌పి ఎస్ఐ నాగప్ప, కానిస్టేబుల్ వాసు తెలిపిన వివరాల మేరకు.. రైలులో ప్రయాణిస్తూ తురకపల్లి రైల్వే వంతెన వద్ద ఓ గుర్తు తెలియని యువకుడు(30) రైలు బోగీ తలుపు నుంచి కిందికి పడడంతో తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. అతడు రెడ్ టీ షర్ట్, లోయర్ ధరించాడు. అతడు ఆత్మహత్య చేసుకున్నాడా లేక ప్రమాదవశాత్తూ రైల్లో నుంచి కిందపడి మరణించాడా అనే విషయం పోలీసుల దర్యాప్తులో తెలియాల్సి ఉంది. జిఆర్‌పి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.



రికార్డులను పరిశీలిస్తున్న ఎంపిడిఒ రామచంద్ర

సచివాలయ సిబ్బంది అందుబాటులో ఉండాలి

ప్రజాశక్తి-బెళుగుప్ప

ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేయాలని సచివాలయం సిబ్బందికి ఎంపీడీవో రామచంద్ర సూచించారు. స్థానిక రెండవ సచివాలయాన్ని బుధవారం ఎంపీడీవో సందర్శించి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిబ్బంది సక్రమంగా విధులకు హాజరై ప్రజల సమస్యలు పరిష్కరించాలన్నారు. ఎవరైనా పనివేళలు ముగియకుండానే వెళ్లిపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. బయోమెట్రిక్ అటెండెన్స్ రోజుకు మూడుసార్లు వేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు

ఓటరు నమోదుపై 21 నుంచి ఇంటింటి తనిఖీ

రాయదుర్గం : ఈ నెల 21 నుంచి ఆగస్టు 21వ తేదీ వరకు నియోజకవర్గంలో ఓటర్ల జాబితాపై ఇంటింటా తనిఖీలు నిర్వహిస్తున్నట్లు నియోజకవర్గ ఎన్నికల ప్రత్యేకాధికారి, ఆన్ సెట్ జిల్లా ముఖ్య అధికారి కేశవనాయుడు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. పోలింగ్ బూత్ స్థాయి అధికారి ప్రతి ఇంటికి వెళ్లి ఓటర్ల జాబితాను పరిశీలిస్తారన్నారు. అందులో భాగంగా జాబితాలో చేర్పులు, మార్పులు, సవరణలు, తొలగింపులు, తదితరాలు చేస్తారన్నారు. అలాగే ఈ నెల 20వ తేదీ ఉదయం 11:30 గంటలకు తహశీల్దార్ కార్యాలయ ఆవరణలో రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహిస్తామన్నారు. అందులో పోలింగ్ బూత్‌ల తనిఖీ, ఓటర్ల జాబితాలో ప్రత్యేక సవరణలకు సంబంధించి చర్చిస్తామన్నారు.

శింగనమల మార్కెట్‌యార్డ్ డైరెక్టర్‌గా అమీర్‌బాషా

నార్పల : శింగనమల మార్కెట్ యార్డ్ డైరెక్టర్‌గా నార్పలకు చెందిన తేరుకాటి అమీర్‌బాషా నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందుబాటులో ఉంటూ రైతుల అభ్యున్నతికి కృషి చేస్తానని తెలిపారు. తనను మార్కెట్ యార్డ్ డైరెక్టర్‌గా నియమించిన ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, ప్రభుత్వ విద్యా సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి, నార్పల సత్యనారాయణ రెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు. అమీర్‌బాషాను వైసిపి నాయకులు పూలమాలలతో సత్కరించారు. కార్యక్రమంలో ఖాదర్‌వలి, జిలాన్‌బాషా, గోపాల్ రెడ్డి, దాడితోట బాషా, గొల్ల సుధాకర్, రాజు, పాముల ప్రకాష్, సోమనాథ్, ప్రభాకర్, రజాక్, సునీల్, తదితరులు పాల్గొన్నారు.

విఆర్ఎల సమస్యలు పరిష్కరించాలి

గుత్తి : గ్రామ రెవెన్యూ సహాయకుల సమస్యలను పరిష్కరించాలని మండల వీఆర్ఏల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు చిరంజీవి, నారాయణస్వామిలు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం తహసిల్దార్ ఎస్.మహబూబ్ బాషా కు మండల విఆర్ఏల సంఘం ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 20, 21వ తేదీల్లో రిలే నిరాహార దీక్షలు చేపడుతున్నట్లు చెప్పారు. సమస్యలను ప్రభుత్వం పరిష్కరించేంత వరకు తమ పోరాటాలు ఆపేది లేదన్నారు. ఈ కార్యక్రమంలో మండల వీఆర్ఏల సంఘం నాయకులు సుధాకర్ బాబు, రాంప్రసాద్, జగదీష్, యుగంధర్, రమణ, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

డెంగీపై అవగాహన ర్యాలీ

ఉరవకొండ : డెంగీ నివారణ మాసోత్సవాల్లో భాగంగా బుధవారం మండల పరిధిలోని రాయంపల్లిలో ఆరోగ్య కేంద్ర సిబ్బంది సిహెచ్ఓ నాగరంగయ్య, సూపర్‌వైజర్ శేఖర్ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. టైగర్ దోమ పగటి పూట మాత్రమే కుడుతుందని తద్వారా డెంగీ జ్వరం వస్తుందని, డెంగీ వస్తే తలనొప్పి, ఒళ్లు, కీళు, కండరాల నొప్పులు, కాంటిలోపల ఎర్రగా మారి కనుగుడ్డు తిప్పలేక పోవడం లాంటి లక్షణాలు ఉంటాయన్నారు. దోమలు నీటిలో గుడ్లు పెట్టి అభివృద్ధి చెందుతాయి కావున ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలన్నారు. లక్షణాలు కనిపించిన వెంటనే వైద్యుడిని సంప్రదించాలన్నారు. దోమలు కుట్టకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సచివాలయ ఎఎన్ఎం సలీమబేగం, ఎంఎల్‌హెచ్‌పి రూపా, హెల్త్ అసిస్టెంట్ నిమ్మల వెంకటేష్, పంచాయతీ కార్యదర్శి హనుమంతరెడ్డి, సిఒ భగవాన్‌దాస్, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



ఆత్మకూరు జగనన్న కాలనీని పరిశీలిస్తున్న సిపిఎం నాయకులు శివశంకర్

పక్కా గృహాలకు రూ. 5 లక్షలివ్వాలి

ఆత్మకూరు : ప్రభుత్వం 'జగనన్న కాలనీ'ల్లో నిర్మిస్తున్న పక్కా గహాలకు రూ. 5 లక్షల చొప్పున మంజూరు చేయాలని సిపిఎం మండల కార్యదర్శి శివశంకర్ డిమాండ్ చేశారు. ఆయన బుధవారం ఆత్మకూరు జగనన్న కాలనీని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పక్కాగృహాలు నిర్మించుకునేందుకు ప్రభుత్వం ఇచ్చే రూ. 1.80 లక్షలు ఏమాత్రం సరిపోదని, నిర్మాణ వ్యయం ఎక్కువగా ఉందని, కావున రూ. 5 లక్షలు ఇవ్వాలని కోరా రు. అలాగే కాలనీలో మౌలిక వసతులు కల్పించాలన్నారు. ఆయన వెంట సిపిఎం నాయకులు, తదితరులు ఉన్నారు.

రైతుల పక్షపాతి సిఎం జగన్

ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి

ప్రజాశక్తి-గుత్తి

సిఎం జగన్ రైతుల పక్షపాతి అని ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని వన్నెదొడ్డి గ్రామంలో బుధవారం సర్పంచి బేడల లక్ష్మీదేవి, వైసిపి జిల్లా నాయకులు బేడల వెంకటరాముడు ఆధ్వర్యంలో 'గడప గడపకూ మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేతో పాటు గుంతకల్లు మున్సిపల్ వైస్ ఛైర్‌పర్సన్ నైరుతిరెడ్డి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం ప్రవేశపెట్టిన నవరత్న పథకాల గురించి ప్రజలకు వివరించారు. అలాగే వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ముందుగా ప్రత్యేకంగా అలం కరించిన ట్రాక్టర్‌పై ఎమ్మెల్యే, వైసిపి నాయకులను స్థానిక నాయకులు ఊరేగించారు. ఎమ్మెల్యేను గజమాలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజలు అభివృద్ధి చెందాలనే సంకల్పంతో సిఎం జగన్ అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి అర్హులందరికీ సంక్షేమ ఫలాలను అందజేస్తున్నారన్నారు. ప్రజలు చంద్రబాబును నమ్మవద్దన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ జి.విశాలాక్షి, మార్కెట్ యార్డ్ ఛైర్‌పర్సన్ సి.సునీలాయాదవ్, సీనియర్ నాయకులు బి.శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎంపీపీ కోనా మురళీధర్‌రెడ్డి, మండల కన్వీనర్ జి.గోవర్ధన్‌రెడ్డి, జిల్లా నాయకులు కె.మధుసూదన్‌రెడ్డి, బి.రాజకుమార్‌రెడ్డి, నాయకులు నారాయణస్వామి, బేడల రమేష్, స్టోర్ డీలర్ కె.మల్లికార్జున, రంగస్వామి, టి.వెంకటేశ్వర్‌రెడ్డి, వెంకటరామిరెడ్డి, ఎన్.రామచంద్ర యాదవ్, ఎ.సూర్యనారాయణరెడ్డి, బి.రమేష్‌రెడ్డి, ఎంపీటీసీ చిన్న వీరన్నగౌడ్, కౌన్సిలర్లు వాల్మీకి శివ, వరద, సుబ్బు, సర్పంచులు ఆర్.గురుమస్తాన్, ఎం.గోపాల్, చంద్ర, తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే వైవిఆర్‌ను గజమాలతో సత్కరిస్తున్న వైసిపి నాయకులు

ఓర్వలేకే ప్రతిపక్షాల ఆరోపణలు

మాజీ ఎమ్మెల్యే విశ్వ

ప్రజాశక్తి-ఉరవకొండ

సిఎం జగన్ ప్రజలకు చేస్తున్న మంచిని, అందిస్తున్న సంక్షేమ పథకాలను చూసి ఓర్వలేని ప్రతిపక్షాలు నిత్యం వైసిపి ప్రభుత్వంపై దుష్ప్రచారం చేస్తున్నాయని నియోజకవర్గ ఇన్‌ఛార్జి వై.విశ్వేశ్వరరెడ్డి విమర్శించారు. మండల పరిధిలోని పెద్ద కౌకుంట్ల గ్రామంలో బుధవారం నిర్వహించిన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో విశ్వ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరించి బుక్‌లెట్‌లు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ సొంత గ్రామం కౌకుంట్ల పంచాయతీకి రూ. 56 కోట్లను సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు ఖర్చు చేసినట్లు తెలిపారు. రానున్న ఎన్నికల్లో ఉరవకొండలో వైసిపి జెండా ఎగరవేయడం ఖాయమన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ చంద్రమ్మ, జడ్పిటిసి పార్వతమ్మ, వైస్ ఎంపీపీ నరసింహులు, కురుబ, ఎంబిసి, బెస్త కార్పొరేషన్ల రాష్ట్ర డైరెక్టర్లు జోగి వెంకటేశులు, గోవిందు,రమణ, నాయకులు ఎర్రిస్వామి, అశోక్‌కుమార్, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, తదితరులు పాల్గొన్నారు.

కుక్కల దాడిలో జింకకు గాయాలు

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం

మండల పరిధిలోని నుసికొట్టాల గ్రామంలో బుధవారం కుక్కలదాడిలో ఓ జింకపిల్ల గాయపడింది. అటుగా వెళ్తున్న కొందరు రైతులు ఆ కుక్కలను తరిమివేసి ఆ జింకను రక్షించి ప్రాథమిక చికిత్స చేశారు. అలగే ఈ విషయాన్ని స్థానిక ఫారెస్టు, పోలీసుల అధికారులకు తెలిపి జింకపిల్లను రూరల్ పోలీసుస్టేషన్‌కు తీసుకొచ్చారు. సిఐ శ్రీనివాసులు ద్వారా దానిని ఫారెస్టు శాఖ అధికారులకు అందజేశారు. వన్యప్రాణులను కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత అని, జింకపిల్లను రక్షించినవారిని అభినందించారు.

చిరు ధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం

జై కిసాన్ ఫౌండేషన్ అధ్యక్షులు నాగమల్లి ఓబులేసు

ప్రజాశక్తి-ఉరవకొండ

"చిరు ధాన్యాలు పండించుకుందాం-ఆరోగ్యాన్ని కాపాడుకుందాం" అని జై కిసాన్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు నాగమల్లి ఓబులేసు పేర్కొన్నారు. మండల పరిధిలోని వెలిగొండ ప్రభుత్వ హైస్కూల్ ప్రాంగణంలో బుధవారం రైతులకు పర్యావరణంతో పాటు చిరుధాన్యాల ప్రాముఖ్యతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిరుధాన్యాలు ఆరోగ్యాన్ని కాపాడే దివ్య ఔషధమే కాకుండా, రైతులకు సిరిని పెంచే ధాన్యాలుగా గుర్తించాలన్నారు. చిరుధాన్యాలు సాగు చేయడం ద్వారా తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడు లు పొందవచ్చన్నారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతి ఒక్కరూ అవకాశం ఉన్న చోట మొక్కలు నాటి సంరక్షించాలని పిలుపునిచ్చారు. అనంతరం 15 మంది విశ్రాంత వృద్ధ రైతులను జై కిసాన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పూలమాలలు వేసి శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచి వీరాంజనేయులు, జై కిసాన్ ఫౌండేషన్ సభ్యులు నాగమల్లి అక్రాంత్‌రుషి, రైతులు పాల్గొన్నారు.



చిరుధాన్యాలపై అవగాహన కల్పిస్తున్న ఓబులేసు

ఎలక్ట్రీషియన్లకు సంక్షేమ పథకాలను మంజూరు చేయాలి

ప్రజాశక్తి-గుత్తి

సంక్షేమ పథకాలు అమలు చేయాలని కోరుతూ బుధవారం తహశీల్దార్ ఎస్.మహబూబ్ బాషాకు గౌతమపురి ఎలక్ట్రీషియన్స్ అండ్ ఎలక్ట్రానిక్స్ మోటార్ వర్కర్స్ సొసైటీ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సొసైటీ మండల అధ్యక్ష, కార్యదర్శులు నారాయణస్వామి, ప్రభాకర్ మాట్లాడుతూ మండలంలో దాదాపు వంద మంది ఎలక్ట్రీషియన్లు ఉన్నారని, చాలామందికి రేషన్ కార్డులు కూడా లేవన్నారు. అందరికీ సంక్షేమ పథకాలను అమలు చేయడంతో పాటు పక్కా గృహాలు మంజూరు చేయాలని, సొసైటీకి స్థలం కేటాయించి, పక్కా భవనం నిర్మించాలనిన్నారు. కార్యక్రమంలో గౌతమపురి ఎలక్ట్రీషియన్స్ అండ్ ఎలక్ట్రానిక్స్ మోటార్ వర్కర్స్ సొసైటీ నాయకులు రాణా, కన్నా, సతీష్, తదితరులు పాల్గొన్నారు.



తహశీల్దార్ మహబూబ్‌బాషాకి వినతి ఇస్తున్న ఎలక్ట్రీషియన్లు

స్టోన్ క్రషర్లు తొలగించాలి

మండల పరిధిలోని జక్కలచెరువు గ్రామశివారులో పొలాల మధ్య ఏర్పాటు చేసిన స్టోన్ క్రషర్లను తొలగించాలని శ్రీగౌతమపురి దివ్యాంగుల మండల సమాఖ్య నాయకుడు సి.రామతీర్థం డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం తహశీల్దార్ ఎస్.మహబూబ్‌బాషాకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో శ్రీగౌతమపురి దివ్యాంగుల మండల సమాఖ్య నాయకులు శ్రీనివాసులు, దత్తాత్రేయ, వెంకటేష్, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

సూచిక బోర్డులు ఏర్పాటు

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

మండల పరిధిలోని ప్రధాన కూడళ్లు అయిన షిరిడిసాయిబాబా ఆలయం, ముసలమ్మ కట్ట రోడ్డులో తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటుండడంతో సిఐ నాగార్జునరెడ్డి ప్రత్యేక చొరవ తీసుకొని ప్రమాద సూచికలు ఉన్న బోర్డులు ఏర్పాటు చేయించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ ప్రమాదాల నివారణలో భాగంగా ప్రయాణికులు, ద్విచక్ర వాహనదారులు, ఆటోలు, తదితర వాహనాల డ్రైవర్లకు కనిపించేలా సూచిక బోర్డులు ఏర్పాటు చేశామన్నారు. వీటి వల్ల కొంతైనా ప్రమాదాలను నివారించవచ్చు అన్నారు. వాహనదారులు అతివేగంగా వెళ్లకుండా తగిన జాగ్రత్తలు పాటించాలని, రూల్స్ అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.



ప్రమాద సూచికలు ఉన్న బోర్డులను ఏర్పాటు చేయిస్తున్న సిఐ నాగార్జునరెడ్డి

ఘర్షణలో వ్యక్తికి గాయాలు

పుట్లూరు : పుట్లూరులో ఇళ్ల ముందర వర్షం నీరు పారే విషయంలో మంగళవారం రాత్రి చోటుచేసుకున్న ఘర్షణలో ఒకరు గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాలు.. గ్రామంలోని ఓ వీధిలో వర్షం నీరు ఇళ్ల ముందు పారే విషయంలో రాజు, అతని కుటుంబ సభ్యులు రామాచారిపై దాడి చేయడంతో గాయపడ్డాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు రాజు, అతని కుటుంబ సభ్యులపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.